క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జేష్టమాసం మూడవ శని వారం పౌర్ణమి సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా చండీ హోమం



పూర్ణాహుతి సమర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో శనివారం పౌర్ణమి పర్వదిన సందర్భంగా ఘనంగా చండీ హోమాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, ఉప దేవతా హోమం, చండీ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, వేదపాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరశర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని నందిని క్లాత్ మార్కెట్ సమీపంలో శనివారం పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీ పాదవల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో 500 మందికిపైగా భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. ప్రతి నెలా పౌర్ణమినాడు భక్తులకు అన్నప్రసాద పంపిణీ ఉంటుందని, భక్తులు పాల్గొనాలని శ్రీపాదవల్లభ దత్తాత్రేయస్వామి సేవా సంఘం వారు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు చింతకుంట జయచంద్ర, బాలు, లక్ష్మణ్, కిరణ్, రాజేష్, శ్రీనివాసులు, రామచంద్రరావు, నరేష్‌గుప్త, భక్తులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



కోనేరులో గంబూషియా చేపలను వదులుతున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు క్రైం : గ్రామీణ ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కల్లూరు, అమృతానగర్, కాకిరేణిపల్లె, నరసింహాపురం, చెన్నమరాజుపల్లె, గోపవరం గ్రామాల్లో ఉన్న కోనేరు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణ చర్యల్లో భాగంగా శనివారం గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రసుత్తం వర్షాలు పడుతున్నందున నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, సీహెచ్‌ఓ గౌతమీ, సంధ్య పాల్గొన్నారు.

26న వేలంపాట

ముద్దనూరు : 2024–25 ఆర్థిక సంవత్సరానికి ముద్దనూరు మేజర్ పంచాయతీ వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి వీరభద్రుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు పంచాయతీ పరిధిలోని బస్టాండు, జంతువధశాల, సులభ్‌కాంప్లెక్స్ నిర్వహణలకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బస్టాండు నిర్వహణకు రూ.2లక్షలు, జంతువధశాలకు రూ.20వేలు, సులభ్‌కాంప్లెక్స్‌కు రూ.1000లు డిపాజిట్ చెల్లించాలి. ఆసక్తి గలవారు గ్రామపంచాయతీకి డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని కార్యదర్శి తెలిపారు.

పెరుగుతున్న అరటి సాగు విస్తీర్ణం

- పులివెందుల నియోజకవర్గంలో 8 వేల ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ.60 వేలుపైనే పెట్టుబడులు
- 8 నుంచి 12 టన్నుల మేర దిగుబడులు



అరటిమొక్కలను కాపాడుకునేందుకు రక్షణగా పెట్టిన ఈతాకులు



సాగులో ఉన్న అరటి పంట

వేముల : నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ఏడాది అరటి సాగు విస్తీర్ణం పెరిగింది. జిల్లాలోని పులివెందుల నియోజకవర్గంలో అత్యధికంగా అరటి సాగవుతోంది. ఏడాదికి ఏడాది అరటి సాగు విస్తీర్ణం పెరుగుతూ ఈ ఏడు 15 శాతం మేర విస్తీర్ణం పెరిగిందని ఉద్యానశాఖ అధికారులు అంటున్నారు. ఇందుకు ఒకేరకమైన పంటలు సాగుచేయడం ద్వారా దిగుబడులు తగ్గిపోయి నష్టపోతున్న రైతులు అరటిసాగుకు ఆసక్తి కనపరుస్తున్నారు. అరటిసాగు చేసే రైతులు పొలాలను ముందుగానే దుక్కులు చేసి పశువుల ఎరువులు వేసి సాగుకు సిద్ధం చేస్తారు. అరటిసాగులో ఆదాయం ఉండటంతో రైతులు ఆదిశగా దృష్టి సారిస్తున్నారు.

నియోజకవర్గంలో 8 వేల ఎకరాల్లో సాగు

పులివెందుల నియోజకవర్గంలో అరటిపంట ఎక్కువ విస్తీర్ణంలో సాగైంది. నియోజకవర్గ వ్యాప్తంగా 8 వేల ఎకరాల్లో ఈ ఏడాది రైతులు అరటి సాగు చేస్తున్నారు. ఒకసారి అరటి సాగుచేస్తే మూడు పంటలు తీయవచ్చన్న ఉద్దేశంతో రైతులు అరటిని ఎంచుకుంటున్నారు. నియోజకవర్గంలోని పులివెందుల, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లె మండలాల్లో అరటి సాగుచేస్తారు. మే, జూన్, జూలై నెలల్లో ఎక్కువగా అరటిని సాగుచేయడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతినకుండా ముందుగానే దిగుబడులు వచ్చేలా రైతులు అరటిపై దృష్టిపెడుతున్నారు.

వేసవిలో అరటిని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు

అరటిపంట సాగు చేసే సమయంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. అరటి మొక్కలను కాపాడుకునేందుకు రైతుల అవస్థలు అన్నిఇన్నీ కావు. నాటిన అరటి మొక్కలను బ్రతికించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. అరటి మొక్కలకు ఈత ఆకులను రక్షణగా చేసి ఉష్ణోగ్రతల నుంచి రక్షించుకుంటున్నారు. ఇందుకోసం అదనపు ఖర్చులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. నెలరోజుల పాటు అరటిపంటలను రక్షించుకోవాల్సి వస్తుందని లేదంటే మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

ఎకరాకు రూ.60 వేలకు పైనే పెట్టుబడులు

అరటి సాగులో పెట్టుబడులు ఎక్కువగా అవుతున్నాయి. ఎకరాకు రూ.60 వేలకు పైనే పెట్టుబడులు పెడుతున్నామని రైతులు అంటున్నారు. ఎకరాకు 1200 మొక్కలను నాటుతున్నారు. ఎక్కువగా జెయిన్, క్యాడిల్లా, మైక్రోసన్, ఎక్సెల్, విట్రో, కెఎఫ్‌బయోటెక్‌రీటా కంపెనీలకు చెందిన గ్రాండ్ 9 యాలకి అనే అరటి రకాలను ఈ ప్రాంతంలో ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఒక్కో మొక్కను రూ.12 లతో కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. అరటి మొక్కలు నాటిన మొదలు సస్యరక్షణ చేపడుతూ మొక్కలను కాపాడుకుంటున్నారు. అంతేకాక కలుపుతీయడం, సేద్యాలు, కూలీఖర్చులు, ఎరువులు, తదితర వాటి కోసం అదనపు ఖర్చులు కావడంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయని రైతులు అంటున్నారు.

ఎకరాకు 8 నుంచి 12 టన్నుల దిగుబడులు

అరటిసాగులో దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటున్నాయి. ఎకరాకు 8 నుంచి 12 టన్నుల దిగుబడులు అందుతున్నాయి. సాగుచేసిన 10 నెలల తర్వాత దిగుబడులు వస్తున్నాయి. దిగుబడులు అందే సమయానికి ప్రకృతి వైపరీత్యాలతో ఎక్కడ తోటలు దెబ్బతింటాయోనని రైతులలో ఆందోళన ఉంటోంది. తోటలలో అరటిగెలలు కోతకోసే వరకు రైతులకు కంటిమీద కునుకు ఉండదు. ఇన్ని ఆటుపోట్ల నుంచి బయటపడితేనే అరటిలో ఆదాయం ఉంటుందని, లేదంటే పెట్టుబడులు కూడా గిట్టుబాటు కాని పరిస్థితి ఉంటుందని రైతులు అంటున్నారు.



సాగుచేసేందుకు సిద్ధంగా ఉన్న అరటి మొక్కలు

5 ఎకరాల్లో అరటి సాగుచేసా



నాకున్న 5 ఎకరాల్లో అరటిని సాగుచేసా. సాగుకు రూ.3 లక్షలు పైనే పెట్టుబడి పెట్టా. ఒక్కో మొక్కను రూ.12లతో కొనుగోలు చేసి ఎకరాకు 1200 మొక్కల చొప్పున నాటా. దిగుబడులు వచ్చేవరకు సకాలంలో మందులను పిచికారీ చేసి నీటితడులు అందిస్తున్నా. దిగుబడులు పెరుగుతున్నా ఆదాయం ఉంటుందన్న ఆశతో సాగుచేశాం. మార్కెట్‌లో ధరలు బాగా ఉంటే ఆదాయం ఉంటుందని ఆశతో ఉన్నాం.

– శివశంకర్‌రెడ్డి, అరటి రైతు, మబ్బుచింతలపల్లె

అరటిసాగుపై రైతుల ఆసక్తి



గత రెండేళ్లుగా అరటి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో ధరలు నిలకడగా ఉండటం, భూగర్భ జలాలు పుష్కలంగా ఉండటంతో అరటిసాగు విస్తీర్ణం పెరుగుతోంది. చనిపోయిన చీనీచెట్ల స్థానంలో పంట మార్పిడి కోసం రైతులు అరటిని సాగుచేస్తున్నారు. ఒకసారి సాగుచేస్తే మూడు పంటలు తీయవచ్చన్న ఉద్దేశంతో రైతులు ఆదిశగా అరటికి మొగ్గుచూపుతున్నారు.

– జి.రాఘవేంద్రారెడ్డి, హెచ్‌ఓ, పులివెందుల

రేపు విద్యుత్ అదాలత్

ప్రొద్దుటూరు : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక, ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో ఈనెల 24న స్థానిక పవర్ హౌస్ కాంపౌండ్‌లోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈఈ జి.శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాన్ని అధ్యక్షులు రిటైర్డు జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు కె.రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు జి.ఈశ్వరమ్మ నిర్వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్, సీనియర్ అకౌంట్ ఆఫీసర్, ప్రొద్దుటూరు డివిజన్‌కు సంబంధించిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్/అసిస్టెంట్ ఇంజనీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, సిబ్బంది అదాలత్‌లో పాల్గొంటారని తెలిపారు. ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల కోసం ఈ నెల 25వ తేదీ లోపల విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పి.తులశమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు ఈ నెల 27వ తేదీన అడ్మిషన్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులు జిల్లాలోని ఏ పాఠశాలలో సీటు కావాలంటే ఆ పాఠశాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల్లోని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024 పదవ తరగతి పరీక్షల్లో టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులకు దిగువ తంబళ్ళపల్లె గ్రామానికి చెందిన నాలిపుల్లారెడ్డియాదవ్ ట్రస్టు ఆధ్వర్యంలో నగదు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు కమాల్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సర్పంచ్ వెంకటయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలురకాల సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు విద్యారంగానికి నాలిపుల్లారెడ్డియాదవ్ ట్రస్టు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పేద, బడుగు, బలహీన, మధ్యతరగతి వర్గాల పిల్లలు విద్యాపరంగా అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని భావించి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ట్రస్టు వ్యవస్థాపకులు నాలి కృష్ణారెడ్డియాదవ్, నాలి రామకృష్ణయాదవ్‌లు అభినందనీయులని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపకులు మాట్లాడుతూ తాము పుట్టి పెరిగిన ప్రాంతానికి తమ వంతు సహాయం అందించాలనే ఆలోచనతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహాయం చేస్తామని తెలిపారు. అనంతరం మార్కుల పరంగా ప్రథమ స్థానంలో నిలిచిన బి.మొబీనాకు రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన బి.తేజశ్రీకు రూ.4 వేలు, తృతీయ స్థానం సాధించిన పి.భార్గవికి రూ.3 వేలు నగదు ప్రోత్సాహకాలతో పాటు మెమొంటో, ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే 3వ తరగతి విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. అదేవిధంగా సింగరాయపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు బి.వనజమ్మ 4వ తరగతి విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అంకనగురివిరెడ్డి, బి.నారాయణయాదవ్, సింగరయ్య, కలసపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కవిత పాల్గొన్నారు.

భూకబ్జాలపై చర్యలు తీసుకోరా?



సమావేశంలో మాట్లాడుతున్న గాలి చంద్ర

పోరుమామిళ్ల : పాలకులు మారినా అధికారులు భూ కబ్జాలపై చర్యలు తీసుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఆరోపించారు. శనివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో జరిగిన నాలుగు మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బద్వేలు నియోజకవర్గంలో ఇటీవల ప్రభుత్వ భూముల కబ్జా పెద్ద ఎత్తున జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కొన్ని మండలాల్లో తహసీల్దార్లు తాము ఎన్నికల విధుల కోసమే వచ్చామని, భూ కబ్జాలతో సంబంధం లేదని చేతులు దులుపుకోవడం దారుణమన్నారు. రంగసముద్రం పంచాయతీలో జేసీబీలు పెట్టి ప్రభుత్వ భూములు చదును చేస్తున్నారని, కంచెలు వేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

తిరుపతిరెడ్డి కాలనీ వాసులకు పట్టాలు ఇవ్వాలి

రంగసముద్రం పంచాయతీలో 11 సంవత్సరాల క్రితం పేదలు తిరుపతిరెడ్డి కాలనీ ఏర్పాటు చేసుకున్నారని, అధికారులు పలుమార్లు తనిఖీలు చేసి పట్టాలిస్తామని హామీలు ఇచ్చి అమలు చేయలేదని ఆయన అన్నారు. హైకోర్టును ఆశ్రయిస్తే పేదలకు న్యాయం చేయాలని తీర్పు ఇవ్వడం జరిగిందని, అయినా అధికారులు పట్టాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. వెంటనే పేదలకు పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్, ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్, కార్యవర్గ సభ్యులు కేశవ, సుబ్బారెడ్డి, ప్రసాదరావు, విశ్వాసమ్మ, రేణుకమ్మ, చంద్ర, నారాయణ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ పరామర్శ



నరసింహులును పరామర్శిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురు వైఎస్సార్‌సీపీ నాయకులను శనివారం మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళరాజగోపాల్‌రెడ్డి పరామర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు కౌన్సిలర్ వరలక్ష్మి భర్త, వార్డు ఇన్‌చార్జి అయిన నరసింహులు ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో వైద్యం చేయించుకుని ఇంటికి వచ్చిన నేపథ్యంలో శీలంవారిపల్లెలోని ఆయన ఇంటికి వెళ్ళి పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే 28వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్ అనారోగ్యానికి గురై బెంగుళూరులో చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన నేపథ్యంలో ఆయన ఇంటికి వెళ్ళి పరామర్శించారు. ఏ ఒక్కరు అధైర్యపడకుండా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ ఏరియా కన్వీనర్ చెన్నకృష్ణారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు వెంకటసుబ్బయ్య, రామచంద్ర, సుబ్బరాయుడు, చెన్నయ్య, సుబ్బారెడ్డి, శివారెడ్డి, నరసింహులు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భీమేశ్వరస్వామి తిరునాల ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని వేలూరుపాడు గ్రామసమీపంలో వెలసిన శ్రీభీమేశ్వరస్వామి తిరునాల ఉత్సవాలు శనివారం జరిగాయి. ఉదయం గణపతి పూజ, అభిషేకాలకరణ, పంచామృతాభిషకం, ఆకుపూజ వంటి ప్రత్యేక కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి కాయ కర్పూరాలతో మొక్కులు తీర్చుకున్నారు. అలాగే 10.30 గంటల నుంచి 12.00 గంటల వరకు శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కల్యాణాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని కన్నులారా తిలకించారు. భక్తులకు ఆలయ అవరణలో దాతలు సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన ఎద్దుల యాజమానులకు ఆలయ కార్యనిర్వాహకులు బహుమతులు అందజేశారు.

వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించవద్దు

చాపాడు : యోగివేమన విశ్వవిద్యాలయం ప్రాంగణం నుంచి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు తొలగించాలని వైస్ ఛాన్సలర్‌కు వినతిపత్రం అందించడం శోచనీయం అని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి రాయుడు అన్నారు. ఒకప్పుడు రాజశేఖరరెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసిన వ్యక్తి అలా చేయడం దారుణం అన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని తెలిపారు. వైఎస్సార్ యోగివేమన యూనివర్సిటీ వ్యవస్థాపకుడని, దాదాపు 16 ఏళ్ల నుంచి ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించబడి ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వంటి పథకాల ద్వారా విద్యా రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు.

నేడు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని బుశెట్టి కళ్యాణమండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆదరణ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను పంపిణీ చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదివి, ప్రతి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. సీపీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సహకారంతో ఈ పురస్కారాలు అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, ప్రముఖ సినీనటి అశ్రిత, అడిషనల్ ఎస్పీ లోసారి సుధాకర్, నెహ్రూ యువ కేంద్రం డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ మణికంఠ, అహోబిళ ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలాచార్యులు పాల్గొంటారని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండలంలోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల వేదిక నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ మండల ప్రజల సమస్యలు పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు ఈ వేదిక ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో తహసీల్దారు శిరీష కూడా పాల్గొంటారన్నారు. మండల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహిస్తున్న వేదికలో పాల్గొనాలని వారు కోరారు.

కలసపాడులో..

కలసపాడు : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు క్రిష్ణకుమార్ తెలిపారు. ఈ వేదికలో మండల స్థాయి అధికారులు హాజరవుతున్నందున మండలంలోని ప్రజలు వారి న్యాయమైన సమస్యలపై అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం

కొండాపురం : మండల పరిధిలోని కె.సుగుమంచిపల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం వేదపండితులతో ఘనంగా నిర్వహించినట్లు శనివారం ఆలయ నిర్వాహకులు తెలిపారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని కన్యతీర్థ క్షేత్రంలో వెలసిన మహాత్రిపుర సుందరీదేవి అమ్మవారిని జేష్ట శుద్దపౌర్ణమి సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు 108 రకాల పిండి వంటలు సమర్పించారు.

డయేరియా నివారణకు ముందస్తు చర్యలు



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.క్రిష్ణ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని సభాభవనంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సచివాలయాల సిబ్బంది ప్రతిరోజు తమ పరిధిలోని ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత, డయేరియా వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు పాటించడంతో పాటు ఎక్కడా కూడా నీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే హోటళ్ళు, టిఫిన్ సెంటర్లలో ఆహార పదార్థాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా సంబంధిత యజమానులకు సూచనలివ్వాలని కోరారు. సమావేశంలో డీఈ సుమన్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆయా సచివాలయాల హెల్త్, శానిటరీ సెక్రటరీలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోనేరులో వదిలిన చేప పిల్లలు



చేప పిల్లలను వైద్య సిబ్బందికి అందిస్తున్న దృశ్యం

రాజుపాళెం : నీరు నిల్వ గల ప్రాంతంలో దోమలు, వాటి లార్వాలు అభివృద్ధి చెందకుండా ఉండేందుకు కోనేరులో చేప పిల్లలను వదిలామని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.నారాయణ రెడ్డి అన్నారు. జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు రాజుపాళెం పీహెచ్‌సీ వైద్యురాళ్లు మంజుల, నిఖిల ఆధ్వర్యంలో దోమ లార్వా ఆహారంగా తినే గంబూషియ జాతి చేపలను మండలంలోని కొర్రపాడు గ్రామంలోని కోనేరులో శనివారం వదిలారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లా మత్స్య శాఖ ఈ చేప పిల్లలను ఉచితంగా అందించిందని చెప్పారు. దోమల వ్యాప్తిని అరికట్టే విధంగా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మలేరియా, డెంగ్యూ లాంటి రోగాలను వ్యాపించకుండా ఈ రకమైన చేప పిల్లలను వదులుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, సరస్వతి, పీహెచ్‌ఎన్ విమలమ్మ, ఏఎన్‌ఎం మరియమ్మ, సీహెచ్‌ఓ భారతి, ఆశలు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్

బద్వేలు అర్బన్ : ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పాఠశాలలు ప్రారంభించి వారం రోజులు కావస్తున్నా విద్యాశాఖాధికారులు ఓ ఒక్క ప్రైవేటు పాఠశాలను కూడా తనిఖీ చేసిన దాఖలాలు లేవని అన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని అన్నారు.

భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన



ప్రత్యేక అలంకరణలో లలితాదేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వెంకటేశ్వరస్వామి, స్వామివారి చెల్లెలు లలితాదేవికి విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం లలితాదేవికి మహిళలు సామూహిక కుంకుమార్చన, విఘ్నేశ్వర పూజ, శ్రీచక్ర పూజ నిర్వహించారు.



కుంకుమార్చన చేస్తున్న మహిళలు